# స(ర)దా మీ సేవలో

ఒద్దయ్యా బాబూ అంటే వినకుండా మా సూర్యారావు పోస్టాఫీసు సేవింగ్స్ బ్యాంకిలో డబ్బు వేసేవాడు. "మన దగ్గరుంటే ఖర్చయిపోతుం దయ్యా" అంటూనూ. అవును; డబ్బు దాచుకుందికి ఎన్ని బ్యాంకులు లేవూ, అంటే విన్లేదు.

చివరికి ఓనాడు వాళ్ళక్కయ్యను హఠాత్తుగా వాళ్ళ ఊరికి పంపవలసివచ్చి, డబ్బుకోసం పోస్టాఫీసుకు వెళితే "సారీ సార్! ఇవాళ కేష్ లేదు, రేపు రండి!" అని చెప్పారక్కడి గుమాస్తాగారు. పాపం సూర్యారావు పోస్టుమాస్టర్‌ని కలుసుకుని పోస్టుమార్టమ్ చేశాడు. అయినా "సారీ"యే వచ్చింది.

ఇది చాలా కాలమునాటి ముచ్చట.

అప్పటికి బుద్ధొచ్చిందనుకున్నాను సూర్యానికి.

మొన్నీమధ్య ఒకనాడు పోస్టాఫీసులో కనపడ్డాడు. ఏమయ్యా అంటే కార్డులు కావాలన్నాడు. సరే చూద్దాం కదా అని నిలబడ్డాను. క్యూ తగ్గి కౌంటర్ దగ్గరకు వెళ్ళేసరికి "సారీ సార్! కార్డుల్లేవు, ఇన్‌లాండ్ కవరులున్నాయి." అన్నారు. "పోనీ అవే యివ్వండి

రెండు" అని రూపాయినోటు చూపించేడు సూర్యం. కౌంటర్‌లో ఆయన హంటర్ దెబ్బతిన్న వాళ్ళాగా దూరంగా జరిగి కుర్చీకి చేరబడిపోయి, "చిల్లర లేదు సార్" అని గోళ్లు గిల్లుకోసాగాడు. "అయిదూ ఒక్కసారి కొనేసుకో చిల్లరబాధ వుండదు" అని నేను సలహా చెప్పాక సూర్యానికి ధైర్యం వొచ్చినట్టుంది. కాని లోపలున్నాయన అంత విసుక్కుని ఇవ్వడమెందుకో, ఆ ఇన్‌లాండ్ కవర్లని అన్ని మాట్లు లెక్కపెట్టడం ఎందుకో, ఆ సాకుతో వాటిని పులి విస్తరాకుల్లా నలిపి వేయడమెందుకో మా కిద్దరికీ అర్థంకాలేదు. "ఏమండి, ఇలా వీటిని నలిపేశారే; వీటిమీద రాయడం ఎలాగండి" అని అడిగితే, "లెక్కపెట్టకుండా యిచ్చేయమంటారా? అలా అయితే నూరు కొనుక్కోండి" అన్నాడు లోపలాయన.

"మీరు రాసిన పుస్తకం నాలుగు కాపీలు వి. పి. ద్వారా పంపండి" అని ఎవరో ఉత్తరం రాస్తే, పోస్టాఫీసుకి వి. పి. పార్సెల్ పట్టుకుని వెళ్ళాను. "దీంట్లో ఉత్తరం ఉందేమో చూడాలి- విప్పండి." అన్నారు. లేదు, "కట్టండి" కట్టాను. "మనియార్డరు ఫారం నింపండి" నింపాను. పిన్‌కోడు నెంబరు వెయ్యమన్నారు. తూయించమన్నారు. స్టాంపులకోసారి తిప్పారు. గంట అయింది. తీరా పదిరోజుల తర్వాత కబురెట్టి "మీరు నింపిన మనియార్డర్ ఫారం పోయింది. ఈ డబ్బు మీకే చెందాలని మీరు ఇండెమ్‌టీ బాండు రాసివ్వండి. రెండు రూపాయల జుడిషియల్ స్టాంపుమీద. అప్పుడుగాని మీ సొమ్ము మీకివ్వం" అన్నారు. నేను ఫారం రాయడమేమిటి, మీరెవరో దాన్ని పారేయడమేమిటి, నేను నేనే అని. నేను బాండు రాయటమేమిటి, అని కాసేపు ఏడ్చాను. ఆ ఏడుపు వారికి కంప్లెయింటులా తోచింది. వారం రోజులపాటు నాకు ఉత్తరాలు, పత్రికలు ఏవీ రాలేదు. చివరికి బాండెడ్ లేబరుకి అంగీకరించేనంతే.

ఇవన్నీ చెప్పి సూర్యారావుని పోస్టాఫీసుతో సాధ్యమైనంత తక్కువ సంబంధం పెట్టుకోమని సలహా ఇచ్చేను, అతను విన్లేదు.

మొన్న సత్యారావు దక్షిణదేశయాత్ర కెళ్ళి సూర్యారావు పేరిట కంచిపట్టుచీర వి.పి. లో పంపమని ఆర్డర్ చేశాడు. కంచిలో ఓ ఇరవై అడ్వాన్సిచ్చి అతనింకా రామేశ్వరంలో వుండగానే వి. పి. వచ్చింది. వచ్చినట్లు ఇచ్చిన సమాచారంలో "సూర్నారాయణగారికి రెండు వందలకి వి. పి. అని వ్రాసి, వారంరోజుల్లోగా విడిపించుకోమన్నారు. నా పేరు సూర్నారాయణ కాదు మొర్రో, సూర్యారావు అని మొరెట్టు కున్నాడు. సరే, దిద్దుతాం అని రెండోమాటు "సూర్యం" అని రాసేరు. "ఏమిటండీ మనుషల పేర్లతో మీకీ ఆటలు? మీ పేరు తప్పుగా రాస్తే మీకు చిరాకెయ్యదా? ఇదే మనియార్డయితే నాదైనా నా కివ్వరే" అన్నాడు సూర్యారావు. అంతే, కంచిపట్టు చీర వెనక్కెళ్ళిపోయింది. "రెఫ్యూజ్డు" అని రాయించుకొని, సత్యారావు యిరవై రూపాయలూ గంగలో కలిశాయి.

నాకీ బాధల్లేవు. దెబ్బలు తిని తిని వున్నానేమో, దసరా పండుగ కనుచూపు మేరలో వుండేసరికి పొద్దున్న వారికి, మధ్యాహ్నం వారికి, రిజిష్టర్ ఇచ్చేవారికి మొత్తం ఇరవై రూపాయలు కేటాయిస్తాను. నా ఉత్తరాలు పోవు, పత్రికలు పోవు. ఎప్పుడో పదేళ్ళ క్రితం నేను క్యాంపింగ్ ఆఫీసర్‌గా వుండే రోజుల్లో మా ఆవిడ పేరని రాసిన జెనరల్ ఆథరైజేషన్ ఆధారంగా అన్నీ మాకు సక్రమంగా అందు తున్నాయి.

ఇదీ చెప్పాను సూర్యారావుకి. నువ్వూ కట్టెయ్యి సరదాగా దసరాకి; అని. "నన్నెవరూ అడగరే, ఏం చెయ్యను?" అని వాపోయాడు.

"ఏం, ఎందుకడగరు?" అన్నాను.

"మా నాన్నగారు ఈ వూళ్ళోనే పోస్టుమాస్టర్‌గా పనిచేసేవారు బ్రతికున్న రోజుల్లో" అన్నాడు సూర్యారావు.

ఇంతే సంగతులు చిత్తగించవలెను.

(1-7-78)